క్లుప్తంగా

42 మందికి వైద్యపరీక్షలు

వరికుంటపాడు: మండలంలోని రామదేవులపాడులో 104 వైద్యసేవల్లో భాగంగా మంగళవారం ఫ్యామిలీ ఫిజీషియన్ కరీష్మా 42 మంది రోగులను పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఫ్యామిలీ డాక్టర్‌ను నియమించి మెరుగైన వైద్య సేవలందిస్తోందన్నారు. 104 వాహనం ప్రతి నెల గ్రామానికి వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం కామాక్షి, సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి పనుల తనిఖీ



మస్టర్లు పరిశీలిస్తున్న ఎంపీడీఓ ఐజాక్‌ప్రవీణ్

ఉదయగిరి: పట్టణంలోని చిన్నచెరువులో జరుగుతున్న ఉపాధి హామీ పనులను మంగళవారం ఎంపీడీఓ ఐజాక్ ప్రవీణ్ తనిఖీ చేశారు. పని ప్రదేశంలో కూలీల మస్టర్లు పరిశీలించి హాజరు వేశారు. అనంతరం ఎంపీడీఓ మాట్లాడుతూ రోజురోజుకూ ఎండలు పెరుగుతున్న దృష్ట్యా ఉపాధి కూలీలు ఉదయం ఆరు గంటలకే పనులకు హాజరై 11 గంటలకు వెళ్లాలన్నారు. పని ప్రదేశంలో క్షేత్ర సహాయకులు, మేట్‌లు కూలీలకు కొలతల ప్రకారం పనులు కల్పించి మార్కింగ్ ఇవ్వాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన రూ.272 కూలి నగదు గిట్టుబాటయ్యేలా పనులు చేయించాలన్నారు. ఆయన వెంట టీఏ కృష్ణ, ఎస్ఏ హరి ఉన్నారు.

వర్క్‌బుక్‌లు పరిశీలించాలి



ఉదయగిరి: పాఠశాల తరగతి గదిలో ప్రతిరోజు ఉపాధ్యాయులు విద్యార్థుల వర్క్‌బుక్‌లను పరిశీలిస్తుండాలని ఎంఈఓ షేక్ మస్తాన్‌వలి సూచించారు. ఆయన మంగళవారం మండలంలోని గంగిరెడ్డిపల్లి, మాసాయిపేట మెయిన్ ప్రాథమిక పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల ప్రగతిని, సామర్థ్యాలను వర్క్‌బుక్‌లు పరిశీలించారు. నాడు–నేడు రెండో విడత పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. విద్యార్థులకు భోజన పథక నిర్వాహకులు మెనూ ప్రకారం భోజనం అందించాలన్నారు. ఈ నెల 20 నుంచి జరిగే సమ్మేటివ్ అసెస్‌మెంట్– 2, సీబీఏ పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేయాలన్నారు. ఓఎంఆర్ షీటులో పరీక్షలు రాసేలా అవగాహన కల్పించాలన్నారు.

ఆధారాల కోసం అన్వేషణ

కావలి: కావలి పట్టణంలో కలకలం సృష్టించిన బృందావనం చోరీ ఘటనలో పోలీసులు ఆధారాల కోసం అన్వేషణ వేగవంతం చేశారు. కట్టుదిట్టమైన భద్రత ఉండే బృందావనం కాలనీలో ఆదివారం వేకువన గుర్తుతెలియని వ్యక్తులు భారీ చోరీకి పాల్పడిన విషయం తెలిసిందే. ఈ ఘటనను ఛాలెంజింగ్‌గా తీసుకున్న ఎస్పీ తిరుమలేశ్వర్‌రెడ్డి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. కావలి పోలీసులతో పాటు సీసీఎస్ అధికారులు, సాంకేతిక బృందాలు కూడా వేర్వేరుగా విచారణ ముమ్మరం చేసినట్లు తెలిసింది. సోమవారం సాయంత్రం వరకు సీసీ కెమెరాల్లో ఎటువంటి ఆధారాలు లభించకపోగా, మంగళవారం మరి కొన్ని సీసీ కెమెరాలను పరిశీలించగా నిందితుల ఆనవాళ్లు లభించినట్లుగా భావిస్తున్నా రు. పాతనేరస్తుల పనిగా ప్రాథమిక ఆధారాలు లభించడంతో ఆ కోణంలో విచారణ వేగవంతం చేసినట్లుగా తెలిసింది. మరోవైపు సాంకేతిక ఆధారాల ఆధారంగా కూడా భిన్న కోణాల్లో విచారణ చేపట్టినట్లుగా తెలిసింది. మొత్తం చోరీ ఘటనపై మంగళవారం రాత్రి తొమ్మిది గంటల సమయాని కి పోలీసు అధికారులు ఒక అంచనాకు వచ్చి నిందితుల కోసం ప్రత్యేక బృందాలను ఇతర ప్రాంతాలకు పంపించినట్లుగా సమాచారం.

సీసీ కెమెరాలపైన నిర్లక్ష్యం

చోరీ జరిగిన బృందావనం కాలనీతో పాటు పట్టణంలోని ప్రధాన రహదారి వెంట, దుకాణాల వద్ద విస్తృతంగా సీసీ కెమెరాలు ఉన్నాయి. ఎటువంటి నేరం జరిగినా కెమెరాల్లో రికార్డయ్యేలా ఏర్పాటు చేసిన కెమెరాల నిర్వహణ, సీసీ పుటేజీల పరిశీలనలో మాత్రం అంతులేని నిర్లక్ష్యం కనిపిస్తోంది. నిందితుల కదలికలు నమోదయ్యేందుకు అవకాశం ఉన్న పలు ప్రాంతాల్లోని సీసీ కెమెరాల పుటేజీని మంగళవారం సాయంత్రం వరకు కూడా సేకరించలేదని తెలిసింది.

సేకరణ కేంద్రం ద్వారా అమ్ముకోవాలి

చేజర్ల: నిమ్మ రైతులు తమ పంటలను ఉద్యాన సేకరణ కేంద్రాల ద్వారా అమ్ముకోవాలని జిల్లా ఉద్యాన అధికారి ఎంవీ సుబ్బారెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని ఎన్‌వీ కండ్రికలో రైతు ఉత్పత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పెనుశిల లక్ష్మీనరసింహ ఉద్యాన ఉత్పత్తిదారుల సెంటర్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యానశాఖ తరఫున ఉద్యాన పంటల సేకరణ కేంద్రాలను 75 శాతం సబ్సిడీతో ఇవ్వడం జరుగుతుందన్నారు. రైతులు తాము పండించిన పంట ఉత్పత్తులను దళారులతో మోసపోకుండా నేరుగా అమ్ముకోవచ్చని తెలిపారు. రైతులు సంఘాలుగా ఏర్పడి బలోపేతం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన అధికారి లక్ష్మి, రైతులు తేళ్లశేఖర్ రెడ్డి, తేళ్ల ఆదిశేషారెడ్డి, పోలంరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, బాలకృష్ణారెడ్డి, రాంబాబు, రఘురామిరెడ్డి గ్రామ రైతులు పాల్గొన్నారు.

గ్రావెల్ తవ్వేస్తున్నారు..

ఉదయగిరి నియోజకవర్గంలో గ్రావెల్ మాఫియా రెచ్చిపోతోంది. చెరువులు, మైదానాల్లో గ్రావెల్, మట్టి తవ్వకాలపై ప్రభుత్వం నిషేధం విధించింది. మార్చి ఆఖరు నాటికి గతంలో ఇచ్చిన అనుమతులు పూర్తయ్యాయి. కొత్తగా ఎవరికి అనుమతులు ఇవ్వలేదని ఇరిగేషన్, మైనింగ్ అధికారులు స్పష్టం చేశారు. ఎక్కడైనా మట్టి, గ్రావెల్ అక్రమ రవాణా జరిగితే కేసులు నమోదు చేయాలని పోలీస్, రెవెన్యూ అధికారులకు కూడా ఆదేశాలు జారీ అయ్యాయి. అయినా నియోజకవర్గంలో రాత్రిపూట యథేచ్ఛగా అక్రమ రవాణా జరుగుతోంది.

- నిషేధం ఉన్నా.. యథేచ్ఛగా తవ్వకాలు
- అనుమతులు లేకుండా చెరువుల్లో మట్టి తరలింపు
- ప్రభుత్వ ఆదాయానికి గండి
- చోద్యం చూస్తున్న అధికారులు



వింజమూరు పాతారు చెరువులో గ్రావెల్ తరలింపుతో ఏర్పడిన పెద్ద పెద్ద గోతులు

ఉదయగిరి: గ్రావెల్ మాఫియా రెచ్చిపోతోంది. రాత్రి వేళల్లో భారీగా వాహనాలు, యంత్రాలు ఏర్పాటు చేసి విచ్చలవిడిగా మట్టి తరలిస్తున్నారు. మట్టి, గ్రావెల్ తవ్వకాలు, రవాణాకు ప్రస్తుతం పాత అనుమతులు రద్దు కాగా, తాజాగా ఎవరికీ అనుమతులు ఇవ్వలేదు. వీటిపై ప్రభుత్వం నిషేధం విధించింది. అయినా యథేచ్ఛగా అక్రమ రవాణా జరుగుతోంది. దీంతో ప్రభుత్వానికి రాయల్టీ ఆదాయం రూ. లక్షల్లో గండి పడుతోంది. అరికట్టాల్సిన ఇరిగేషన్, పంచాయతీరాజ్, రెవెన్యూ, పోలీస్ యంత్రాంగం తమకు పట్టనట్లు మిన్నకుండిపోతున్నాయి.

గుల్లవుతున్న చెరువులు

ఉదయగిరి, దుత్తలూరు, వరికుంటపాడు, వింజమూరు, కలిగిరి, కొండాపురం, జలదంకి తదితర మండలాల్లో రాత్రి వేళల్లో ఇరిగేషన్ చెరువుల నుంచి అనుమతులు లేకుండా యథేచ్ఛగా గ్రావెల్‌ను భారీ వాహనాల్లో తరలిస్తున్నారు. ముఖ్యంగా దుత్తలూరు మండలం నందిపాడు, పాపంపల్లి, ఉదయగిరి మండలం జి.చెరువుపల్లి, ఉదయగిరి పెద్ద చెరువు, వరికుంటపాడు మండలం తోటల చెరువుపల్లి చెరువుల నుంచి ఇటుకల తయారీ కోసం కొంత మంది ఇటుకుల వ్యాపారులు వందల టిప్పర్లు మట్టి తరలిస్తున్నారు. దీనికి ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు లేవు. అయినా స్థానిక అధికారులకు ముడుపులు ఇచ్చుకుంటూ తమ పనిని నింపాదిగా సాగిస్తున్నారు.

రహదారికి భారీగా తరలింపు

ప్రస్తుతం కావలి నుంచి దుత్తలూరు వరకు సుమారు 74 కి.మీ. మేర జాతీయ రహదారులు పనులు ముమ్మరంగా జరుగుతోన్నాయి. ఇందు కోసం పెద్ద మొత్తంలో గ్రావెల్ అవసరం అవుతోంది. ఈ అవసరాల కోసం సంబంధిత కాంట్రాక్టరు అధికారులు నుంచి అనుమతులు పొందాలి. ముందుగా ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకోవాలి. ఈ మేరకు గ్రావెల్ నిక్షేపాలు పరిశీలించి అనుమతులు ఇస్తారు. ఎంత మేర గ్రావెల్ అవసరం, ఏ వాహనాల్లో తరలిస్తున్నారనే వివరాలతో పాటు పగలు మాత్రమే సంబంధిత అధికారి పర్యవేక్షణంలో



బొమ్మరాజు చెరువులో యంత్రాలతో అక్రమంగా మట్టి తరలిస్తున్న దృశ్యం

గ్రావెల్ తరలించాల్సి ఉంటుంది. అయితే ఈ ప్రమాణాలు ఏవీ పాటించడం లేదు. కాంట్రాక్టరు విచ్చలవిడిగా గ్రావెల్ తరలిస్తున్నారు. ఇప్పటికే గతంలో కాంట్రాక్టర్ తీసుకున్న గడువు కూడా ముగిసింది. అయినా లెక్క చేయకుండా రాత్రి వేళల్లో భారీ వాహనాల్లో చెరువులను తవ్వేసి గుల్ల చేస్తున్నారు. పెద్ద పెద్ద గోతులు తీస్తూ మట్టి తరలిస్తున్నారు. దీంతో చెరువుల నుంచి ఆయకట్టుకు నీటి సరఫరాలో సమస్యలు వస్తున్నాయి. వర్షాకాలంలో నీటి గుంతలు నిండిపోవడంతో వాటి లోతు గమనించలేని వ్యక్తులు, సరదాగా ఈతకు వచ్చే విద్యార్థులు ప్రమాదం బారిన పడుతున్నారు.

పోలీసులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోని వైనం

వింజమూరు మండలం బొమ్మరాజు చెరువు నుంచి రోడ్డు పనులకు వారం రోజుల నుంచి టిప్పర్లు పెట్టి గ్రావెల్ తరలిస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న స్థానిక ఇరిగేషన్ ఏఈఈ అక్కడికి వెళ్లి వాటిని అడ్డుకుని పోలీసులకు అప్పగించేందుకు ప్రయత్నం చేసినా వారు లెక్క చేయకుండా తీసుకెళ్లారు. దీంతో ఆమె స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసినా ఇంత వరకు కేసు నమోదు కాలేదు. వారు మాత్రం రోజూ గ్రావెల్ తరలిస్తునే ఉన్నారు. కావలి చుట్టు పక్కల ప్రాంతాల్లో పదుల సంఖ్యలో పుట్టుకొస్తున్న లే అవుట్లు కోసం జలదంకి చెరువు నుంచి భారీగా గ్రావెల్ తరలిస్తున్నారు. ఇటీవల ఆ చెరువు ఆయకట్టు రైతులు, గ్రామస్తులు అడ్డుకోవడంతో తాత్కాలికంగా ఆగింది. అయినా రాత్రి వేళల్లో ఇష్టారాజ్యంగా తవ్వకాలు చేస్తున్నారు.

అనుమతులు తప్పనిసరి

చెరువుల నుంచి గ్రావెల్ తరలించేందుకు అనుమతులు అవసరం. గతంలో ఇచ్చిన అనుమతుల కాలపరిమితి అయిపోయింది. తాజాగా ఎవరికీ ఇప్పటి వరకు అనుమతులు ఇవ్వలేదు. అనుమతులు లేకుండా మట్టి తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. అక్రమంగా మట్టి తరలించే వారు వద్ద మా నుంచి వచ్చిన అనుతులు లేకపోతే పోతే రెవెన్యూ, పోలీస్‌లకు ఫిర్యాదు చేస్తే వారు కూడా చర్యలు తీసుకుంటారు.

– కృష్ణమోహన్, ఇరిగేషన్ ఎస్ఈ

ఈద్గాలో వసతుల పరిశీలన



ఆత్మకూరు ఈద్గా మైదానాన్ని పరిశీలిస్తున్న వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్, వైస్ ప్రెసిడెంట్

ఆత్మకూరు: రంజాన్ పండగ ప్రత్యేక ప్రార్థనల కోసం ఆత్మకూరు పట్టణంలోని ఈద్గా మైదానాన్ని వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్ అహమ్మద్, జిల్లా వైస్ ప్రెసిడెంట్ షౌకత్ ఆలీ మంగళవారం సాయంత్రం పరిశీలించారు. రంజాన్ రోజున ఈద్గా మైదానంలో ముస్లింలు వేలాది మంది ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించేందుకు వక్ఫ్‌బోర్డు ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేయనున్నారు. వారి వెంట శ్రీహజ్రత్ సుల్తాన్ షాహీద్ ఔలియా దర్గాకు చెందిన కమిటీ సభ్యులు ఉన్నారు.

వాహనదారులు హెల్మెట్ ధరించాలి

వరికుంటపాడు: వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఎస్సై విజయశ్రీనివాస్ తెలిపారు. ఆయన మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్ సమీపంలోని జాతీయ రహదారిపై వాహనాలు తనిఖీ చేశారు. ఆ మార్గంలో వెళ్తున్న వాహనాలు తనిఖీ చేసి సరైన ధ్రువపత్రాలు లేని వారికి అపరాధ రుసుం విధించారు. అనంతరం మాట్లాడుతూ వాహనదారులు తప్పనిసరిగా లైసెన్సు కలిగి ఉండాలని, వాహనాల ధ్రువపత్రాలు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. వాహనం నడిపేటప్పుడు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. ఆయన వెంట సిబ్బంది ఉన్నారు.

సంక్షేమ పథకాలతో సరికొత్త వెలుగులు

- ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి



లబ్ధిదారులకు ప్రభుత్వం అందించిన పథకాల బుక్‌లెట్‌ను అందిస్తున్న ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల ద్వారా పేదల జీవితాల్లో సరికొత్త వెలుగులు నిండుతున్నాయని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని మూడో వార్డులో మంగళవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరించారు. లబ్ధిదారులతో మాట్లాడుతూ సంక్షేమ పథకాల ద్వారా వాళ్ల జీవితాల్లో వచ్చిన మార్పులు అడిగి తెలుసుకున్నారు. అన్నీ అర్హతలు ఉన్నా సాంకేతిక సమస్యలతో పథకాలు అందని లబ్ధిదారులతో మాట్లాడి సమస్య పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వినూత్న సంక్షేమ పథకాల అమలుకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. అందులో భాగంగానే పేదలకు ఉచితంగా నివేశన స్థలాలు పంపిణీ చేయడంతో పాటు పక్కా ఇళ్లు కూడా నిర్మించి ఇస్తున్నట్లు తెలిపారు. వీటితో పాటు ఆర్థిక భద్రత కల్పించే దిశగా పలు పథకాలు అమలు చేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

3,500 హెక్టార్లలో సూక్ష్మ సేద్యం లక్ష్యం

- ఏపీఎంఐ పీడీ శ్రీనివాసులు



డ్రిప్ పరికరాల బిగింపును పరిశీలిస్తున్న శ్రీనివాసులు

వరికుంటపాడు: జిల్లాలో 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 3,500 హెక్టార్లలో సూక్ష్మ సేద్యం చేయడానికి డ్రిప్ పరికరాలను అమర్చాలని లక్ష్యంగా నిర్దేశించామని జిల్లా సూక్ష్మ నీటిపారుదల పథకం పథక సంచాలకులు బి.శ్రీనివాసులు తెలిపారు. ఆయన మంగళవారం మండంలోని రామాపురం, దక్కునూరు గ్రామాలలో డ్రిప్ పరికరాలు అమర్చిన పంట పొలాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ 2022–23 ఏడాదికి 2,900 హెక్టార్లు లక్ష్యం కాగా 3,436 హెక్టార్లలో డ్రిప్ బిగించి లక్ష్యాన్ని అధిగమించామన్నారు. జిల్లాకు ఏడు కంపెనీలను కేటాయించామన్నారు. డ్రిప్ పరికరాల బిగింపు ప్రక్రియను వేగవంతంగా చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో నరేష్, రమేష్, వివిధ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

మౌజన్లకు ఆర్థిక సాయం అందజేత



ఆత్మకూరు మసీదులో మౌజన్లకు ఆర్థిక సాయం అందజేస్తున్న తారక్‌నాథ్‌రెడ్డి

ఆత్మకూరు: ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని 9 మసీదుల్లో పనిచేస్తున్న మౌజన్, పేష్ ఇమామ్‌లకు బొమ్మిరెడ్డి తారక్‌నాథ్‌రెడ్డి మంగళవారం ఆర్థిక సాయం అందజేశారు. పట్టణంలోని పడమర వీధి పెద్ద మసీదులో రంజాన్ మాస ఉపవాసాల అనంతరం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి ఒక్కొక్క మౌజన్‌కు రూ.2 వేలు చొప్పున ఆర్థిక సాయం అందజేశారు. ప్రతి ఏటా తన తండ్రి దివంగత డాక్టర్ రవీంద్రనాథ్ రెడ్డి జ్ఞాపకార్థం రంజాన్ మాసంలో మసీదులో పనిచేస్తున్న ముగ్గురు మౌజన్, పేష్ ఇమామ్‌లకు ఆర్థిక సాయం అందజేయడం ఆనవాయితీగా వస్తోంది. అలాగే ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న బాషాకు రూ.4 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆయా మసీదుల నిర్వహణ కమిటీ సభ్యులు, విశ్రాంత ఉపాధ్యాయులు సాధిక్ హుస్సేన్, వైఎస్సార్‌సీపీ నాయకులు ముజ్జు, సయ్యద్ మున్నా తదితరులు పాల్గొన్నారు.

ముస్లింలలకు ఎమ్మెల్యే ఇఫ్తార్ విందు



కావలి: కావలి నియోజకవర్గంలోని ముస్లింల ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి పట్టణంలోని తన నివాసంలో మంగళవారం ఇఫ్తార్ విందు ఇచ్చారు. పవిత్ర రంజాన్ మాసం నేపథ్యంలో ఉపవాస దీక్ష చేపట్టిన ముస్లింలను ఎమ్మెల్యే ప్రత్యేకంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ముస్లిం మత పెద్దలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించిన అనంతరం ఉపవాస దీక్ష విరమించి ఇఫ్తార్ విందు స్వీకరించారు. నియోజకవర్గంలోని ముస్లింలు, మతపెద్దలు పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందుకు అల్లూరు ముస్లింలు

అల్లూరు: కావలిలోని ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి స్వగృహంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు అల్లూరు మండలలానికి చెందిన ముస్లిలు హాజరయ్యారు. మంగళవారం సాయంత్రం మండలంలోని ముస్లిం నాయకులు షేక్ ఉస్మాన్ షరీఫ్ ఆధ్వర్యంలో భారీగా స్థానిక మసీద్ సెంటర్ నుంచి బస్సులో బయలుదేరారు. కార్యక్రమంలో షేక్ బాబు, రఫీ, జంషీర్, షన్నా, సాబీర్, మసూద్, సంధాని పాల్గొన్నారు.

ఓటుకు ఆధార్ అనుసంధానం వేగవంతం చేయాలి

ఆత్మకూరురూరల్: ఎన్నికల కమిషన్ ఆదేశాలకు అనుగుణంగా ఓటుకు ఆధార్ అనుసంధానం ప్రక్రియను వేగవంతం చేయాలని ఆత్మకూరు తహసీల్దారు లక్ష్మీ నరసింహం చెప్పారు. తన కార్యాలయంలో మండలంలోని బీఎల్‌ఓలకు మంగళవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. 6బీ పత్రంలో బీఎల్‌ఓలు ఓటర్ల పూర్తి వివరాలతో పాటు వారి ఓటుకు అనుసంధానం చేసేందుకు అవగాహన కల్పించాలన్నారు. పూర్తిస్థాయిలో ఈ కార్యక్రమాన్ని వేగవంతం చేసేందుకు స్థానిక ప్రజాప్రతినిధులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్ల సలహాలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దారు రాజేష్, సీనియర్ అసిస్టెంట్ కొండయ్య, మండలంలోని వీఆర్‌ఓలు, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

ఎస్సైకు వైఎస్సార్‌సీపీ నేతల సత్కారం



ఎస్సైని సన్మానిస్తున్న వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ నాయకులు

వింజమూరు (ఉదయగిరి): వింజమూరు నూతన ఎస్సైగా బాధ్యతలు చేపట్టిన రంగనాథ్‌గౌడ్‌ను వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ నాయకులు మంగళవారం కలిసి సన్మానించారు. శాంతిభద్రతల సంరక్షణకు పూర్తి సహకారం అందిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కొండాపురం మండల ఎస్టీ సెల్ అధ్యక్షుడు ఎస్.శ్రీనివాసులు, నాయకులు వసంత్‌కుమార్, మాలకొండయ్య, కొండయ్య పాల్గొన్నారు.

వెలుగు సిబ్బందికి నేటి నుంచి శిక్షణ

ఆత్మకూరు: ఆత్మకూరు వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో ఆత్మకూరు, ఉదయగిరి నియోజకవర్గాల పరిధిలోని 12 మండలాల వెలుగు సిబ్బందికి బుధవారం నుంచి శిక్షణ తరగతులు ప్రారంభం కానున్నట్లు మండల ఏపీఎం బి వెంకమ్మ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వెలుగు కార్యాలయంలో ఎన్ఆర్ఎల్ఎం లోకోస్ యాప్‌పై మూడు రోజుల పాటు శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు తెలిపారు. వైఎస్సార్ క్రాంతిపథం పీడీ, డీపీఎంలు ముఖ్య అతిథులు పాల్గొంటారన్నారు.

ఆకట్టుకున్న పురాతన వస్తువుల ప్రదర్శన

సోమశిల: అనంతసాగరం శాంతినికేతన్ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఏర్పాటు చేసిన పురాతన వస్తువుల ప్రదర్శన ప్రత్యేకంగా ఆకట్టుకుంది. అనంతసాగరం ఎంపీపీ పెయ్యల సంపూర్ణమ్మ, శాప్ డైరెక్టర్ కాలువ నరసింహులు ఈ ప్రదర్శనను ప్రారంభించారు. ఎగ్జిబిషన్‌లో వివిధ దేశాలు, కాలాల నాటి నాణేలు, కరెన్సీ నోట్లు, పురాతన శిలలు, వివిధ రకాల వస్తువులు ఏర్పాటు చేయడంతో విద్యార్థులు ఉత్సాహంగా తిలకించారు. ఈ కార్యక్రమంలో అనంతసాగరం సర్పంచ్ శోభ, పాఠశాల డైరెక్టర్ గోలి ప్రభాకర్, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయండి

అల్లూరు: నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా అల్లూరు మండలంలో మంజూరైనటువంటి అన్ని హౌసింగ్ లేఅవుట్లలో ఇళ్ల నిర్మా ణాలను వేగవంతం చేయాలని హౌసింగ్ ఈఈ రంగవరప్రసాద్ సూచించారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో హౌసింగ్ అధికారులు, పలుశాఖలకు చెందిన అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జగనన్న కాలనీలోని ఇంటి నిర్మాణాల్లో ఎటువంటి జాప్యం లేకుండా పూర్తి చేయాలని సూచించారు. పాఠశాలల్లో నాడు–నేడు కింద మంజూరైన పను లు పూర్తి చేయాలన్నారు. మండల స్పెషల్ ఆఫీసర్ మృదుల, మండల హౌసింగ్ అధికారి జమీల్, ఎంపీడీఓ శ్రీదేవి, కమిషనర్ ఫణికుమార్, ఈఓపీఆర్డీ వీరేంద్ర, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

హెడ్‌కానిస్టేబుల్ మృతి

సోమశిల: అనంతసాగరం పోలీస్‌స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న కరిముల్లా ఖాన్ (55) సోమవారం రాత్రి మృతి చెందారు. ఆయన కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఆయన స్వగ్రామం కావలిలో మంగళవారం అంత్యక్రియలు నిర్వహించారు. ఎస్సై సంతోష్‌కుమార్‌రెడ్డి, సిబ్బంది హెడ్‌కానిస్టేబుల్ కుటుంబాన్ని పరామర్శించి సంతాపం తెలిపారు.

సంక్షేమాన్ని చూడలేని సైకో మీడియా



పెగళ్లపాడులో లబ్ధిదారులకు సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందజేసి వివరిస్తున్న ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి

ఆత్మకూరురూరల్ (మర్రిపాడు): ప్రతి గడపకు సంక్షేమాన్ని అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందని సైకో మీడియా ఓర్వలేనితనంతో లేని సమస్యలను ఉన్నట్లుగా చిత్రీకరిస్తూ బరితెగించి దుష్ప్రచారానికి తెగబడుతున్నాయని ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి అన్నారు. మర్రిపాడు మండలం పెగళ్లపాడు, ఉమ్మాయిపల్లి గ్రామాల్లో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విలేకర్లతో మాట్లాడుతూ తాను కొత్తగా రాజకీయాల్లోకి వచ్చానని ఎత్తులు, పైఎత్తులు వంటివి తనకు ఇంకా వంట బట్టలేదన్నారు. ప్రజలకు ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలతో పాటు తన వంతుగా సాధ్యమైనంత సేవ చేసేందుకు కృషి చేస్తున్నానని తెలిపారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజలకు ప్రభుత్వం ద్వారా అందించిన సంక్షేమ పథకాలను వివరించడంతో పాటు ఇంకా పరిష్కారం కాని సమస్యలను తెలుసుకుని చిత్తశుద్ధితో పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామన్నారు. ప్రజలు సైతం ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలపై ఎంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు. అయితే కొన్ని ఛానల్స్, పచ్చపత్రికలు లేనిది ఉన్నట్టు చిత్రీకరించి దుష్ప్రచారానికి ఒడిగట్టడం సమంజసం కాదన్నారు. అంతకు ముందు పెగళ్లపాడులో వైఎస్సార్‌సీపీ నాయకులు చెవుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో బాణసంచా హడావుడి, పూల జల్లులతో ఎమ్మెల్యే బృందానికి ఘన స్వాగతం పలికారు. అనంతరం గ్రామంలోని రామాలయం వద్ద నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డిని గజమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా పెగళ్లపాడు ఎస్సీ కాలనీ, పెగళ్లపాడు ప్రధాన గ్రామాల్లో వైఎస్సార్ సుజలధార పథకాలను ఆయన ప్రారంభించారు. ఇర్లపాడు సచివాలయం పరిధిలో రూ.11 కోట్ల మేర సంక్షేమ, అభివృద్ధి పథకాలు ప్రభుత్వం ద్వారా లబ్ధిదారులకు అందాయని, ఇందులో మహిళలకు ప్రత్యేకించి రూ.2 కోట్ల మేర ఆసరా నిధులు పంపిణీ చేశామన్నారు. సామాజికంగా, ఆర్థికంగా అట్టడుగు వర్గాల వారిని ఆదుకొనేందుకు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశ చరిత్రలోనే నిలిచిపోతాయన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల గుండెల్లో స్థిర స్థాయిగా ఉంటారని తెలిపారు. పెగళ్లపాడు పంచాయతీలోని హైలెవల్ కెనాల్ భూముల పరిహారంపై స్థానిక సర్పంచ్ చెవుల ప్రవీణాశ్రీనివాస్ ఆధ్వర్యంలో రైతులు ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేయడంతో సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొర్రా సుబ్బిరెడ్డి, బూదవాడ సొసైటీ అధ్యక్షుడు చెన్ను శ్రీధర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ ముటుకుంద లక్ష్మీరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు కోనంకి శ్రీనివాసులు నాయుడు, కృష్ణప్రసాద్‌రెడ్డి, కొండారెడ్డి, జనార్దన్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, ఇన్‌చార్జి ఎంపీడీఓ మస్తాన్‌ఖాన్, ఆర్‌డబ్ల్యూఎస్, హౌసింగ్, ట్రాన్స్‌కో ఏఈలు రవితేజ, రవికుమార్, బాలసుబ్రహ్మణ్యం, వెలుగు సీసీ మహాలక్ష్మీ, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, గృహ సారథులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాలు నివారించాలి



మర్రిపాడు బస్టాండ్ సెంటర్‌లో అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక

వింజమూరు (ఉదయగిరి): అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకుని వాటిని నివారించాలని వింజమూరు అగ్నిమాపక అధికారి పి.జయరామయ్య తెలిపారు. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఇరుకైన ప్రదేశంలో అగ్నిప్రమాదం జరిగితే, స్పృహ కోల్పోయి న వారిని ఏ విధంగా రక్షించాలో మాక్ డ్రిల్ నిర్వహించారు.

అత్యవసర మార్గాలు వినియోగించాలి

ఆత్మకూరురూరల్(మర్రిపాడు): అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు తక్షణ నివారణ కోసం అత్యవసర మార్గాలను వినియోగించాలని మర్రిపాడు అగ్నిమాపక అధికారి పెంచలయ్య కోరారు. గ్యాస్ సిలిండర్ లీకై మంటలు వ్యాపించినప్పుడు, పాఠశాలలు, ఆస్పత్రులు, పెట్రోల్ బంకులు, గ్యాస్ గోడౌన్లు, నివాసాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. స్థానిక వైద్యులు రమణారెడ్డి రాజేష్ పాల్గొన్నారు.

వేసవిలో నీటి ఇబ్బందులు రానివ్వం

- ఈఈ శ్రీనివాసరావు



అనంతసాగరం నీటి పథకాన్ని పరిశీలిస్తున్న ఈఈ శ్రీనివాసరావు

సోమశిల: గ్రామాల్లో ప్రస్తుత సీజన్‌లో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక దృష్టి సారించామని ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ ఎం.శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం అనంతసాగరం ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి పంచాయతీల వారీగా నీటి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం వైఎస్సార్ సుజల ధార, సోమశిల సీపీడబ్ల్యూఎస్ స్కీంలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోమశిల సీపీడబ్ల్యూఎస్ స్కీం త్వరలో ప్రజలకు అందుబాటులోకి వచ్చేలా పనులు పూర్తి చేయిస్తామన్నారు. ప్రస్తుతం సుజలధార పథకం ద్వారా కొన్ని గ్రామాలకు శుద్ధి జలాలు అందిస్తున్నామని, మిగిలిన గ్రామాలకు నీటి సరఫరా జరిగేలా అధికారులకు ప్రత్యేక సూచనలు చేశామన్నారు. ఆరోగ్య సమస్యలు రాకుండా నిర్దేశిత సమయంలో ట్యాంకులను శుభ్రపరిచేలా సిబ్బందికి ఆదేశాలిచ్చామని, ఆ దిశగా పనులు చేయించి సురక్షిత జలాలు అందించేలా దృష్టి సారించినట్లు ఆయన స్పష్టం చేశారు. ఆత్మకూరు ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ వెంకటేశ్వర్లు, అనంతసాగరం ఎంపీడీఓ మధుసూదన్ రావు, ఏఈ సుదర్శన్ ఉన్నారు.

ఆధార్ అప్‌డేట్ తప్పనిసరి

కలిగిరి: ప్రతి ఒక్కరూ తమ ఆధార్‌కార్డును తప్పనిసరిగా అప్‌డేట్ చేసుకోవాలని ఎంపీడీఓ ఆర్‌వీ కళాధర్ రావు తెలిపారు. పెద్దకొండూరు గ్రామ సచివాలయంలోని ఆధార్ నమోదు కేంద్రాన్ని మంగళవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఈ నెల 27వ తేదీ వరకు మొబైల్ ఆధార్ క్యాంప్ డ్రైవ్ కార్యక్రమం జరుగుతుందన్నారు. మొబైల్ వాహనం గ్రామంలోకి వచ్చిన గ్రామ సచివాలయంలో విధులు నిర్వర్తించే పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, మహిళా పోలీసులు గ్రామస్తుల ఆధార్ కార్డులను అప్‌డేట్ చేయించాలని సూచించారు.

ఆధార్ నమోదుకు అవకాశం

చేజర్ల: మండలంలోని సచివాలయాల్లో ఆధార్ నమోదు చేసుకొనేందుకు ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేశామని ఎంపీడీఓ విజయలలిత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొత్తగా నమోదు చేసుకునే వారికి, చేర్పులు, మార్పులకు అవకాశం ఉందన్నారు. ఈ నెల 18 నుంచి 27వ తేదీ వరకు సచివాలయాల్లో ఆధార్ నమోదు కేంద్రాలు ఏర్పాటు చేశారన్నారు.